సాక్షి
కాకినాడ

శుక్రవారం | 17 | అక్టోబర్ | 2025



రూ.1,01,116 విరాళం

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి బొడ్డు అనసూయ (కొవ్వూరు) గురువారం రూ.1,01,116 విరాళం సమర్పించారు.



సదా వేంకటేశం.. స్మరామి స్మరామి

కోనసీమ తిరుమలగా ఖ్యాతికెక్కిన వాడపల్లి క్షేత్రంలో శ్రీ, భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలు ఆబాల గోపాలాన్ని మురిపిస్తున్నాయి.

II లో

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం 2,13,627 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రం లోకి విడిచిపెట్టారు. అలాగే తూర్పు డెల్టాకు 2,700, మధ్య డెల్టాకు 1,400, పశ్చిమ డెల్టాకు 6 వేల క్యూసెక్కులు వది లారు. బ్యారేజీ వద్ద 10, భద్రాచలం వద్ద 20 అడుగులుగా నీటి మట్టాలు నమోదయ్యాయి.

న్యూస్‌రీల్

'సాక్షి'పై పోలీసుల తీరు చట్ట విరుద్ధం



వాతాడ నవీన్‌రాజ్

సాక్షి ప్రతినిధి, కాకినాడ: 'సాక్షి' కార్యాలయానికి పోలీసులు రావడం చట్ట విరుద్ధమైన చర్య అని ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు వాతాడ నవీన్‌రాజ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'సాక్షి' పత్రికా కార్యాలయంలోకి వచ్చి, ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డికి నోటీసులు ఇవ్వడం, ఇబ్బందికర పరిస్థితులు సృష్టించడం, అక్రమ కేసులు బనాయించడం, అర్ధరాత్రి వరకూ హడావుడి చేయడం సరి కాదని అన్నారు. ఇతర పాత్రికేయులను భయభ్రాంతులకు గురి చేసేలా వ్యవహరించడాన్ని ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈవిధంగా వ్యవహరించడం మంచిది కాదని, జర్నలిస్టుల పట్ల ప్రభుత్వ వైఖరి మార్చుకోవాలని నవీన్‌రాజ్ డిమాండ్ చేశారు.

ధాన్యం సేకరణకు సిద్ధం కావాలి

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ఖరీఫ్ ధాన్యం సేకరణ సజావుగా సాగేందుకు అధికారులు ప్రణాళిక ప్రకారం పని చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. ఖరీఫ్ ధాన్యం సేకరణ ప్రక్రియపై జిల్లా స్థాయి ధాన్యం కొనుగోలు కమిటీ సమావేశాన్ని జూమ్ ద్వారా ఆయన తన క్యాంపు కార్యాలయం నుంచి గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా ఈ నెలాఖరు నుంచి 269 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ చేపడతామన్నారు. రెవెన్యూ, పౌర సరఫరాలు, వ్యవసాయం, సహకారం, రవాణా, కార్మిక శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. రైతు సేవా కేంద్రాల పరిధిలో ధాన్యం సేకరణపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. జిల్లాలోని 116 రైస్ మిల్లులను తనిఖీ చేశామని, అవన్నీ తమ బ్యాంకు గ్యారంటీలను త్వరితగతిన సమర్పించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు అవసరమైన వాహనాలను, హమాలీలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాకినాడ కార్పొరేషన్ ప్రత్యేకాధికారిగా కలెక్టర్

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలిని కాకినాడ కార్పొరేషన్ ప్రత్యేకాధికారిగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. నగరపాలక సంస్థ కమిషనర్‌గా పని చేసిన భావన బదిలీ కావడంతో ఇన్‌చార్జి కమిషనర్‌గా డిప్యూటీ కమిషనర్ కేటీ సుధాకర్‌ను నియమించారు. కార్పొరేషన్‌కు పాలక వర్గం లేకపోవడంతో కలెక్టర్‌ను ప్రత్యేకాధికారిగా ప్రభుత్వం నియమించింది.

ఏలేరులో పెరిగిన నీటినిల్వలు

ఏలేశ్వరం: పరివాహక ప్రాంతంలో వర్షాలు కురుస్తుండటంతో ఏలేరు రిజర్వాయర్‌లో నీటి నిల్వలు పెరుగుతున్నాయి. ఎగువ నుంచి గురువారం 2,200 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటిమట్టం 86.56 మీటర్లు కాగా, 85.25 మీటర్లకు చేరింది. పూర్తి సామర్థ్యం 24.11 టీఎంసీలు కాగా, నీటి నిల్వలు 21.47 టీఎంసీలకు చేరాయి. ఆయకట్టుకు 1,200, విశాఖకు 175 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. తిమ్మరాజు చెరువుకు నీటి విడుదలను నిలిపివేశారు.

బెధరగొట్టేలా..





- అమాంతం పెరిగిన కూరగాయల ధరలు
- వర్షాలతో కుళ్లిపోయిన తోటలు
- తగ్గిన దిగుబడి
- రైతుబజార్లకు తగ్గిన దిగుమతులు
- గతంలో ప్రతి రోజూ 25 టన్నుల విక్రయాలు
- నేడు 17 టన్నులు మాత్రమే..
- ధరలు తగ్గించాలని ప్రజల డిమాండ్



బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): చిక్కుడు కాయలు చిక్కనంటున్నాయి.. దొండకాయలు దడ పుట్టిస్తున్నాయి.. బొబ్బర్లు అబ్బో అనిపిస్తున్నాయి.. ఆకుకూరలు హడలెత్తిస్తున్నాయి.. మార్కెట్‌లో కూరగాయల రేట్లు ఒక్కసారిగా పెరగడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. వర్షాలు కురవక ముందు రూ.100 పెడితే నాలుగైదు రోజులకు సరిపడా కూరగాయలు రైతు బజారులో దొరికేవి. నేడు ఆ పరిస్థితి మారిపోయింది. పది రోజుల్లోనే కూరగాయల ధరలు అనూహ్యంగా పెరిగాయి. కిలో చిక్కుడు కాయలు పది రోజులు క్రితం రూ.75 ఉంటే ఇప్పుడు రూ.110కి చేరింది. తోటకూర, పాలకూర వంటి ఆకుకూరలు గతంలో రూ.20కి నాలుగు కట్టలు ఇచ్చేవారు. ప్రస్తుతం ఒక్కో కట్ట రూ.20 పలుకుతోంది. కొత్తిమీర అయితే కట్ట రూ.30కి విక్రయిస్తున్నారు.

వరుణుడి ప్రతాపంతో..

వారం రోజులు క్రితం వరకూ దాదాపు ప్రతి రోజూ క్రమం తప్పకుండా కురిసిన భారీ వర్షాల ప్రభావంతో తోటల్లో నీరు నిలిచిపోయి, తోటలు కుళ్లిపోయాయి. దీంతో, కూరగాయల దిగుబడి భారీగా పడిపోయింది. ఫలితంగా రైతుబజారుతో పాటు హోల్‌సేల్ మార్కెట్‌కు వచ్చే కూరగాయలకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. జిల్లాలో పెద్దాపురంలో 1, కాకినాడలో 2 రైతుబజార్లున్నాయి. ఈ మూడింటిలో ప్రతి రోజూ 25 టన్నుల కూరగాయలు విక్రయించే వారు. ప్రస్తుతం వర్షాల కారణంగా 17 టన్నులు కూడా రాని పరిస్థితి నెలకొంది. దీంతో రైతుబజారులోనే ధరలు మండిపోతున్న పరిస్థితి ఏర్పడింది. ఇక రిటైల్ మార్కెట్‌తో పాటు, ఇంటింటికీ తిరిగి అమ్మే వారి వద్ద కూరగాయలు కొనాలంటేనే వినియోగదారులు భయపడుతున్నారు. వంగ, దొండ, చిక్కుడు.. ఇలా కొన్ని రకాల కూరగాయలు ధరలు అధికంగా పెరిగాయి. మిగిలినవి కూడా కిలోకు రూ.10 నుంచి రూ.20 వరకూ పెరిగాయి. రైతుబజారుకు కూరగాయల కోసం వస్తున్న ప్రజలు వాటి ధరలు విని అవాక్కైపోతున్నారు. బయటి మార్కెట్లో కిలోకు అదనంగా రూ.20 చెబుతున్నారు.

ఇంకా కార్తిక మాసం మొదలవకుండానే ఇలా ఉంటే.. ఇకపై ధరలు ఎలా పెరుగుతాయోనని వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు. అయ్యప్ప భక్తులతో పాటు, మిగిలిన చాలా మంది కార్తిక మాసమంతా మాంసాహారం తీసుకోరు. దీంతో, ఆ మాసమంతటా కూరగాయల ధరలకు మరింతగా రెక్కలొస్తాయేమోనని ఆందోళన చెందుతున్నారు. మరోవైపు రైతుబజారులో కొందరు తాము పండించిన కూరగాయలు కాకుండా హోల్‌సేల్ మార్కెట్‌లో కొని ఇక్కడ విక్రయిస్తున్నారు. దీంతో, హోల్‌సేల్ కంటే కూడా రైతుబజారులో ఎక్కువ ధరలు చెబుతున్నారని వినియోగదారులు మండిపడుతున్నారు. ప్రభుత్వం, అధికారులు వెంటనే జోక్యం చేసుకుని, ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలు దిగుమతి చేయించి, ధరలు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దిగుబడి బాగా తగ్గింది



వర్షాల కారణంగా తోటలు కుళ్లిపోవడంతో కూరగాయల దిగుబడి ఒక్కసారిగా తగ్గింది. ఇక్కడి రైతుబజారుకు పది రోజుల క్రితం 10 టన్నుల కూరగాయలు వచ్చేవి. ప్రస్తుతం రెండు మూడు టన్నులు మాత్రమే వస్తున్నాయి. బయటి మార్కెట్‌లో కూరగాయల ధరలు పెరగడంతో వినియోగదారులు రైతుబజారుకు అధికంగా వస్తున్నారు. రైతులను ఒప్పించి, తక్కువ ధరలకు అమ్మాలని ఆదేశాలు జారీ చేశాం.

– కృష్ణారావు, ఆర్టీసీ కాంప్లెక్స్ రైతుబజారు ఎస్టేట్ అధికారి, కాకినాడ

10 రోజుల వ్యవధిలో రైతుబజారులో కూరగాయలు ధరలు పెరిగాయిలా.. (కిలోకు రూ.లు)

నల్ల వంకాయ	25.00	40.00
ముప్వ వంకాయ	35.00	50.00
కాకర	20.00	30.00
బీర	25.00	40.00
క్యారెట్	35.00	54.00
దొండ	20.00	30.00
గోరుచిక్కుడు	35.00	50.00
చిక్కుడు	75.00	110.00
బొబ్బర్లు	26.00	40.00
ఆకాకర	75.00	90.00


తోటలు కుళ్లిపోయాయి



వీరవరంలో రెండెకరాల్లో కూరగాయలు సాగు చేస్తున్నాను. గత నెల, ఈ నెలలో కురిసిన వర్షాల కారణంగా వంగ, టమాటాతో పాటు ఇతర కూరగాయల పంటలు కుళ్లిపోయాయి. ప్రస్తుతం ఎండ కాయడంతో బతికి ఉన్న కొన్ని మొక్కల నుంచి కూరగాయలు తెచ్చి, ఇక్కడ విక్రయిస్తున్నాం.

– పి.సూరిబాబు, రైతు

తగ్గేదేలే..



ఎక్కడైనా అరటి గెలకు 10 నుంచి 15 అస్తాలు ఉండటం సర్వసాధారణం. కానీ, కరపలోని దేవు వెంకటేశ్వరరావు ఇంటి ఆవరణలోని ఈ అరటి చెట్టు పొడవైన గెల వేసింది. ఎక్కడా తగ్గేదేలే.. అన్నట్టుగా పెరిగిన ఈ గెలకు 50కు పైగా అస్తాలు ఉండటం విశేషం. ఇంత పొడవైన గెలను అందరూ ఆశ్చర్యంతో తిలకిస్తున్నారు.

– కరప

సత్యదీక్షలకు నేడు శ్రీకారం

అన్నవరం: ఈ నెల 22వ తేదీ నుంచి ప్రారంభం కానున్న కార్తిక మాసంలో సత్యదేవుని సన్నిధికి లక్షలాదిగా తరలివచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకుని రత్నగిరిపై ఏర్పాట్లు చురుకుగా జరుగుతున్నాయి. ఏటా కార్తికానికి ముందు వచ్చే సత్యదేవుని జన్మనక్షత్రం మఖ నాడు ప్రారంభమయ్యే సత్యదీక్షలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, శంకరుల మూలవిరాట్‌లకు తెల్లవారుజామున పంచామృతాభిషేకం చేస్తారు. అనంతరం సత్యదీక్షలు ప్రారంభమవుతాయి. స్వామి సన్నిధిలోనే అర్చకులతో మాలలు వేయించుకుని, భక్తులు ఈ దీక్షలు చేపడతారు. అలా వీలు కాకపోతే ఏదైనా దేవాలయంలో అర్చకుల ద్వారా, ఇంట్లో తల్లి ద్వారా మాల ధరించి ఈ దీక్ష చేపట్టే వీలుంది. 27 రోజుల అనంతరం నవంబర్ 13న స్వామివారి జన్మనక్షత్రం మఖ నాడు సత్యదేవుని సన్నిధిలో ఇరుముడి సమర్పించి, దీక్ష విరమణ చేయాలి. అనంతరం సత్యదేవుని వ్రతమాచరించి, స్వామిని దర్శించడంతో దీక్ష పూర్తవుతుంది.

18 రోజులు, 9 రోజులు చేపట్టే అవకాశం

కాగా, 27 రోజుల దీక్ష చేపట్టే అవకాశం లేని వారు 18 రోజులు, 9 రోజులు కూడా చేపట్టవచ్చు. అయితే దీక్ష విరమణ మాత్రం నవంబర్ 13న మాత్రమే చేయాలి. 18 రోజుల దీక్షను ఈ నెల 26న, 9 రోజుల దీక్షను నవంబర్ 4న స్వీకరించవచ్చు. నవంబర్ 12వ తేదీ రాత్రి రత్నగిరిపై సత్యదీక్ష స్వాములతో సత్యదేవుని పడిపూజ నిర్వహిస్తారు.

వైఎస్సార్ సీపీ కమిటీల్లో పలువురి నియామకం



కాకినాడ రూరల్: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన పలువురు నాయకులను పార్టీ కమిటీల్లో వివిధ హోదాల్లో నియమించారు. పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఈ వివరాలు తెలిపింది. రాష్ట్ర రైతు విభాగం సంయుక్త కార్యదర్శులుగా దాసరి వెంకటేశ్వరరావు (జగ్గంపేట), అడారి రాజబాబు (జగ్గంపేట). రాష్ట్ర మైనార్టీ సెల్ సంయుక్త కార్యదర్శిగా మహ్మద్ అలీషా (కాకినాడ సిటీ) నియమితులయ్యారు. గొల్లప్రోలు నగర పంచాయతీ అధ్యక్షుడిగా మైనం బుల్లియ్య (రాజా)ను నియమించారు.

- మండల అనుబంధ, బూత్ కమిటీల అధ్యక్షులుగా రేలంగి రమణగౌడ్ (తుని మున్సిపాలిటీ), కుర్రా నాగేశ్వరరావు (తుని), వీసం పద్దరాజు (తొండంగి), ఆర్.జోగిరాజు (కోటనందూరు) నియమితులయ్యారు.
- మండల ఇంటలెక్చువల్ ఫోరమ్ అధ్యక్షులుగా టీవై సోమశంకరరావు (తుని మున్సిపాలిటీ), జక్కన రామచంద్రరావు (తుని), సోమిశెట్టి వెంకట సత్య చలపతి (తొండంగి), కాకర్లపూడి వెంకట సీతారామరాజు (కోటనందూరు)లను నియమించారు.
- జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షులుగా ఈరంకి వెంకట సాయి ఉదయ్‌కుమర్, వజ్రపు వీరేష్; ప్రధాన కార్యదర్శులుగా చోడిశెట్టి వెంకటేష్, పాటి సాయి వివేక్, తిరుమలశెట్టి లక్ష్మీకాంత్, ఓరుగంటి రవి; కార్యదర్శులుగా పోలుపర్తి తాతాజీ, బొల్లి నాని, కోర్పు దుర్గాప్రసాద్, మాకినీడి రాజేష్, కడారి సతీష్, మోనిది శివరామకృష్ణ, అనిశెట్టి లోవరెడ్డి, యరకం వెంకట దివాకర్ రెడ్డి, యాసరపు పవన్, కొపనాతి బాబీ, పాలెపు రవి, మాదపాటి సతీష్‌యాదవ్; కార్యవర్గ సభ్యులుగా రామిశెట్టి గోపి, అప్పికొండ లచ్చబాబు, పల్లె కొండలు, తోట తిమ్మరాజు, కొడుకుల సుధీర్, తోలెం విజయ్ నియమితులయ్యారు.
- జిల్లా మహిళా విభాగం ఉపాధ్యక్షులుగా ఎ.సూర్యకాంతం, యేలేటి అనంతలక్ష్మి; ప్రధాన కార్యదర్శులుగా శరకణం కనకలక్ష్మి, వట్టికోళ్ల నాగవేణి, పోలిశెట్టి పద్మావతి, అడ్డాల శ్రీలక్ష్మి, బత్తిన మంగ; కార్యదర్శులుగా వరుపుల కనకలక్ష్మి , రెడ్డి దుర్గాభవాని, పెదపాటి సుజాత, దాకే ధనలక్ష్మి, బొడ్డు ధనలక్ష్మి, నందిక వరలక్ష్మి, దేవకి, మలకల సత్యవేణి, వడ్డి నమని, పి.సూర్యప్రభ, అనిశెట్టి సుభాషిణి; కార్యవర్గ సభ్యులుగా రేపల్లి వెంకటలక్ష్మి, శరకణం రామలక్ష్మి , బండారు అప్పలనరస, కటకం శ్రీదేవి, ఈగల విజయదుర్గ, మాకిరెడ్డి సీతాదేవి, కనేటి రాజేశ్వరి, కొప్పిశెట్టి సత్యకుమారి, పోలనాటి సూకరత్నంలను నియమించారు.
- జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శులుగా ఇజనగిరి ప్రసాద్, నేరపురెడ్డి నాయుడు, గొల్లవిల్లి రామకృష్ణ, సంగాని నందం, దోని చిట్టిబాబు, పినబోతు సత్తిబాబు; కార్యదర్శులుగా బుద్దా లోవబాబు, నేమల దేవుడు, బిత్తర సుబ్బారావు, కటారి త్రిమూర్తులు, లంకే గోపి, వెలమల మల్లేశ్వరరావు, బొర్రా వెంకటేశ్వరరావు, బొర్రా రమణ, మట్టపర్తి రఘు, గర్రే బాబ్జీ, రాయుడు వెంకటేశ్వరరావు, గంటా అప్పలస్వామి, ముప్పనబోయిన సోమరాజు, అనుసూరి గోపి; కార్యవర్గ సభ్యులుగా చిలకమర్తి వెంకటరమణ, తుట్టా జమిందారు, అంకంరెడ్డి పోతురాజు, పెరుమల రాజు, అల్లం వెంకన్న, సింబూతుల శ్రీను, గండేపల్లి సత్యనారాయణలను నియమించారు.
- జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులుగా సలాది బాబులు, చిల్లి దేవరాజు; ప్రధాన కార్యదర్శులుగా దిబ్బా శ్రీను, గొల్లపల్లి రవిబాబు, గొల్ల జయశంకర్, సిగల మధు, బత్తిన రాజు; కార్యదర్శులుగా కర్రి జగదీష్, బొడ్డా విజయ్‌కుమార్, బత్తుల నాగార్జున, బొండాడ అదృష్ట దీపక్, రెడ్డి భీమారావు, నందకుమార్, ఎం.డేవిడ్‌రాజు, దాకరపు వరప్రసాద్, సద్గున మూర్తి, వరసాల జాన్ ప్రభాకర్, పులగల శ్రీనుబాబు, దార వెంకట్రావు, దిమ్మల సత్తిబాబు, పాలిక రాజు, మాతా నాగేశ్వరరావు; కార్యవర్గ సభ్యులుగా నడిపల్లి వీరప్రసాద్, నందిక కళ్యాణ్, బొర్రా శాంతిమోహన్, బి.అమృతరావు, బొడ్డు శ్రీను, టి.ఏసురత్నం నియమితులయ్యారు.

పెత్తందార్లకు దోచిపెట్టేందుకే ప్రైవేటీకరణ

- ఆ బాటలోనే చంద్రబాబు దోపిడీ పాలన
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా
- పెరుమాళ్లపురంలో కోటి సంతకాల సేకరణ ఉద్యమం



కోటి సంతకాల సేకరణను ప్రారంభిస్తున్న దాడిశెట్టి రాజా, యనమల కృష్ణుడు తదితరులు

తొండంగి: సంపద సృష్టిస్తానంటూ అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబు.. తన మందిమాగధులైన పెత్తందార్లకు దోచి పెట్టేందుకు ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా.. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు కోటి సంతకాల సేకరణ ఉద్యమాన్ని తొండంగి మండలం పెరుమాళ్లపురంలో గురువారం ఆయన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో పేద, మధ్య తరగతి ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందాలనే లక్ష్యంతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కేంద్రం సహకారంతో ప్రతి జిల్లాకు ఒక వైద్య కళాశాల స్థాపనకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. వీటిలో కొన్ని నిర్మాణంలో ఉన్నాయన్నారు. ముఖ్యంగా నర్సీపట్నంలో 600 పడకల ఆస్పత్రితో పాటు వైద్య కళాశాల నిర్మాణంలో ఉన్నప్పటికీ అధికార కూటమి నేతలు అక్కడ కళాశాల, ఆస్పత్రి, వాటికి సంబంధించిన జీఓ లేదంటూ బాధ్యతారాహితంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. వైద్య కళాశాలలను ప్రైవేటీకరిస్తే వాటిని తీసుకున్న పెత్తందార్లకు ప్రజలు సొమ్ము చెల్లించాల్సి ఉంటుందన్నారు. రాజ్యాంగం ప్రకారం ప్రజలకు విద్య, వైద్యం అందించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యతని చెప్పారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలో తుని ఏరియా ఆస్పత్రిలోనే సుమారు 30 రకాల వైద్య పరీక్షలకు అవసరమైన సామగ్రిని అందుబాటులోకి తెచ్చామని రాజా గుర్తు చేశారు. సంపద సృష్టిస్తానంటూ అన్నీ ప్రైవేటీకరించేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. తమ ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదలకు రూ.25 లక్షల విలువైన చికిత్సను కార్పొరేట్ ఆస్పత్రుల ద్వారా అందేదని, చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఈ పథకాన్ని పూర్తిగా భ్రష్టు పట్టించారని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు అనేక సంక్షేమ పథకాలను అటకెక్కించేందుకు ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. ఇసుక, మద్యం.. ఇలా అన్ని మార్గాల ద్వారా దోపిడీయే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే చేసిన అప్పుల భారం అంతా ప్రజల పైనే పడుతుందని చంద్రబాబు పాలనపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని అన్నారు. కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం ద్వారా చంద్రబాబు చేపట్టిన వైద్య కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం కోటి సంతకాల సేకరణ నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సమస్యలు తెలుసుకున్నారు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత యనమల కృష్ణుడు, వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేకంగా చంద్రబాబు పాలన

- కార్పొరేట్ శక్తుల పక్షాన నిలుస్తున్నారు
- ప్రభుత్వ వైద్యాన్ని నీరు గార్చేలా మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ
- వైఎస్సార్ సీపీ నేత కురసాల కన్నబాబు
- నేమాంలో రచ్చబండ ద్వారా సంతకాల సేకరణ



కోటి సంతకాల సేకరణలో కన్నబాబు తదితరులు

కాకినాడ రూరల్: కార్పొరేట్ శక్తుల పక్షాన నిలుస్తూ, ప్రజలకు వ్యతిరేకంగా చంద్రబాబు పాలన సాగిస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్, కాకినాడ రూరల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు ఆక్షేపించారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా తొలిసారిగా నేమాం గ్రామంలో గురువారం ఆయన రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల నుంచి సంతకాలు సేకరించి, ఆ ప్రతులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎక్కడైనా పేదలకు విద్య, వైద్యం ఉచితంగా అందిస్తారని, కానీ, చంద్రబాబు మాత్రం ప్రభుత్వ వైద్యాన్ని దూరం చేసేలా మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరిస్తున్నారని విమర్శించారు. ఎంతో మందికి ప్రాణాలు పోసిన ఆరోగ్యశ్రీ పథకాన్ని దాదాపు ఎత్తేసే పరిస్థితి తెచ్చారని, వైద్య కళాశాలలను పైవేటు రంగానికి ఇచ్చేస్తున్నారని అన్నారు. ఇన్ని దుర్మార్గాలు జరుగుతున్నా అడిగే వారు లేరని సొంత మీడియాతో ప్రచారం చేయింకుంటున్నారని దుయ్యబట్టారు. వైద్య కళాశాలలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటీకరించనీయబోమని వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు ఇచ్చారన్నారు. ప్రజల్లోకి వెళ్లి కోటి సంతకాలు చేపట్టడం రాష్ట్ర చరిత్రలో ఇదే తొలిసారని చెప్పారు. అన్ని గ్రామాల్లోనూ ఈ కార్యక్రమం విస్తృతంగా నిర్వహించి, కోటి సంతకాలు సేకరించి, గవర్నర్‌కు అందిస్తామన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఎంతగా అభివృద్ధి చేశారో అనే నిజం ప్రచారం అయ్యేలోపు.. చంద్రబాబు అనే ఒక అబద్ధం దేశాన్ని చుట్టి మళ్లీ అధికారంలోకి వచ్చి కూర్చుందని, ఆయన నోరు విప్పితే అన్నీ అబద్ధాలేనని కన్నబాబు దుయ్యబట్టారు. రూ.99కే క్వార్టర్ మద్యం ఇస్తామని చెప్పి, నకిలీ మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. రూ.99కే మద్యం అనే మాట నిలబెట్టుకోకుండా విశాఖలో మాత్రం ప్రభుత్వ భూములను ఎకరం 99 పైసలకే అప్పనంగా కట్టబెడుతున్నారని విమర్శించారు. ఈ మోసాలు ప్రజలకు, నాయకులకు అర్థమయ్యేలా సోషల్ మీడియా ద్వారా తెలియజేయాల్సి ఉందన్నారు. రుషికొండపై టూరిజం కట్టడాలను జగన్ ప్యాలస్ అంటూ ఆరోపించారని, ఇప్పుడు ప్రైవేటుకు ఇచ్చేందుకు టెండర్లు పిలిచారని అన్నారు. కొన్నాళ్లకు పాఠశాలలను ప్రైవేటీకరించినా ఆశ్చర్యపోనవసరం లేదని కన్నబాబు ఎద్దేవా చేశారు.

నేమాం సర్పంచ్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామదేవు సూర్యప్రకాశరావు (చిన్నా) మాట్లాడుతూ, తమ గ్రామంలో బెల్టు షాపులు కుటీర పరిశ్రమల్లా ఉన్నాయని, వాటిని తొలగించేందుకు ఉద్యమం చేపడతామని అన్నారు. కోటి సంతకాల సేకరణకు అనూహ్య స్పందన వస్తోందన్నారు. చిన్నా ఆధ్వర్యాన, కాకినాడ రూరల్ జెడ్పీటీసీ సభ్యుడు నురుకుర్తి రామకృష్ణ (కిట్టు) అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి, ఎస్‌ఈసీ సభ్యుడు గోపుశెట్టి బాబ్జీ, మహిళా విభాగం జోనల్ ప్రెసిడెంట్ మాకినీడి శేషుకుమారి, వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్త కొబ్బరి (క్వింటాల్)	20,000 – 22,500
కొత్త కొబ్బరి (రెండో రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	30,000
గటగట (వెయ్యి)	28,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	29,000
గటగట (వెయ్యి)	27,000
నీటికాయ	
పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	23,000 – 25,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	23,000 – 25,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	5,250
కిలో	350

పాలనపై పేదవి విరుపు

- కూటమి ప్రభుత్వంలో సంక్షేమం గాలికి
- సంపద కాదు సమస్యలు సృష్టిస్తున్న వైనం
- ఉపాధి కోసం వలసలు వెళ్తున్న బడుగులు
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే సుస్థిరాభివృద్ధి
- నేడు అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవం



వైఎస్సార్ సీపీ పాలనలో ఇంటి వద్దే రేషన్ సరకులు అందుకుంటున్న లబ్ధిదారులు (ఫైల్)



అంగరలో చేనేత పనిలో మహిళ

కపిలేశ్వరపురం: జీవితం పూలపాన్పు కాకపోయినా పట్టెడన్నానికి లోటు లేకుండా సాగిపోతే చాలను కునే వారెందరో.. పేద, మధ్యతరగతి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ప్రస్తుత 'కూటమి' పాలనలో పేదల బతుకులు రోజురోజుకూ దయనీయంగా మారుతున్నాయి. సంపద సృష్టిస్తానంటూ కబుర్లు చెప్పిన కూటమి అగ్రనేతలు అధికారంలోకి వచ్చాక పేదలను సమస్యల సుడిగుండంలోకి నెట్టేస్తున్నారు. శుక్రవారం అంతర్జాతీయ పేదరిక నిర్మూలనా దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం ఇది.

ఉమ్మడి జిల్లాలో అన్నం పెట్టే వరి సాగు భూమి ఎక్కువగానే ఉంది. పండ్లు, కూరగాయల తదితర ఉద్యాన పంటలు పండే లంక, మెట్ట ప్రాంతమూ అధికమే. గౌతమి, వశిష్ట గోదావరి నదుల నుంచి పుష్కలమైన సాగునీరు లభ్యత ఇక్కడి ప్రత్యేకత. పారిశ్రామిక ప్రగతికి ప్రాథమిక భూమిక ఉమ్మడి జిల్లా.. ఇంత ప్రాధాన్యం ఉన్నా పేద, మధ్య తరగతి ప్రజలు ఆర్థిక, సామాజిక సమస్యలతో సతమతమవుతున్నారు. గత టీడీపీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో పేదల జీవితాలు తీసికట్టుగా మారాయి. తమ ప్రభుత్వం రాగానే సంపద సృష్టిస్తామని, ఇంటికో ఉద్యోగమిస్తామని ప్రజలను కూటమి నేతలు నమ్మించారు. 15 నెలల వారి పాలనలో కీలకమైన హామీలు ఆచరణకు నోచుకోలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కల్పించిన ఉపాధి అవకాశాలను సైతం కనుమరుగు చేశారు. కాకినాడ జిల్లాలో 445 గ్రామ సచివాలయాల పరిధిలో 9,015 మంది, 175 వార్డు సచివాలయాల పరిధిలో 3,257 మంది మొత్తం 620 సచివాలయాల పరిధిలో 12,272 మంది వలంటీర్లు ఉండేవారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 512 సచివాలయాల పరిధిలో 9,581 మంది, తూర్పుగోదావరి జిల్లాలో 119 వార్డు, 393 గ్రామ మొత్తం 512 సచివాలయాల పరిధిలో 9,117 మంది వలంటీర్లు సేవలందించేవారు. వారందరికీ రూ.10 వేల గౌరవ వేతనం ఇస్తామంటూ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం నమ్మబలికి అధికారంలోకి వచ్చాక తొలగించింది. ఇంటింటికీ రేషన్ సరకులు అందజేసేందుకు ఉద్దేశించిన వేలాది మంది ఎండీయూ ఆపరేటర్లను తీసేసింది. ఇలా ఆయా కుటుంబాలకు ఉపాధిని దూరం చేసింది.

గతమెంతో ఘనం

2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలోని పేదల జీవన ప్రమాణాలను మెరుగుపర్చే లక్ష్యంతో వ్యవస్థాపరమైన కార్యాచరణ చేసింది. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పటిష్ట చర్యలు తీసుకుంది. ప్రతి కుటుంబానికీ ఏదొక ప్రభుత్వ పథకం ద్వారా క్రమం తప్పకుండా ఆర్థిక లబ్ధి చేకూర్చింది. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చి వ్యవస్థాపరమైన సంక్షేమాన్ని, ఉద్యోగ కల్పనకు కృషి చేసింది. మహిళా మార్టులను ఏర్పాటు చేసి ఉపాధి, మార్కెట్ అవకాశాలను మెరుగుపరిచింది. పేద అక్క చెల్లెమ్మలకు రూ.5 లక్షల విలువైన ఇంటి స్థలాన్ని అందజేసే లక్ష్యంతో తూర్పుగోదావరి జిల్లాలో 431, కాకినాడ జిల్లాలో 241 లేఅవుట్లలో సుమారు 90 వేల ఇళ్ల పట్టాలను అందించింది.

చదువుకు సాయం కరవు

ఉమ్మడి జిల్లాలో వేలాది ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాలయాలు ఉన్నాయి. కోనసీమ జిల్లాలో 608 పాఠశాలలు, 70 కళాశాలలు, తూర్పుగోదావరి జిల్లాలో 635 పాఠశాలలు, 115 కళాశాలలు, కాకినాడ జిల్లాలో 300 పాఠశాలలు, 80 కళాశాలలు ఉన్నాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇన్‌స్టాల్మెంట్లు చెల్లించక ఇంజినీరింగ్ విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం తొలి ఏడాది తల్లికి వందనం ఆర్థిక సాయాన్ని ఆపేసింది.

ప్రచారానికే ప్రాధాన్యం



ఆధునిక సమాజంలో పేదల పరిస్థితులు మెరుగుపడాలంటే ప్రభుత్వం వ్యవస్థాపరమైన కృషి చేయాలి. కూటమి ప్రభుత్వం వచ్చాక వ్యవసాయం, పాడి పరిశ్రమ, చిన్న, మధ్యతరగతి పరిశ్రమల ఏర్పాటు తదితర రంగాల్లో పటిష్టమైన కార్యాచరణ లేదు. ప్రచార కార్యక్రమాలకే ప్రాధాన్యం ఇస్తున్నారు.

–ఎం.గౌరవ్, పిఠాపురం, సామాజిక కార్యకర్త

సాయం అందక వలసలు

కూటమి వచ్చాక ప్రభుత్వం నుంచి అందాల్సిన పథకాలు చాలా వరకూ నిలిచిపోయాయి. తొలి ఏడాదిలో రైతులకు అన్నదాతా సుఖీభవ, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎగ్గొట్టారు. చేనేత కార్మికుల కుటుంబానికి ఇస్తామన్న రూ.25 వేలు ఇవ్వనేలేదు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో గ్రామీణ పేదలు పట్టణ ప్రాంతాలకు, ఇతర వృత్తులకు వలస పోతున్నారు. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లోని చేనేత కార్మికులు ఇతర వృత్తుల్లోకి మళ్లిపోవడం ఉదాహరణ.

కొనలేం.. తినలేం

ప్రస్తుతం నిత్యావసర సరకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కూరగాయల ధరలు ఒకొక్కటిగా పెరిగిపోతున్నాయి. ఎండుమిర్చి రూ.180 నుంచి రూ. 220, వెల్లుల్లి రూ. 240 నుంచి రూ.350 ధరలు పెరిగాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక రేషన్ దుకాణాల్లో ఫిబ్రవరి నుంచి కందిపప్పు సరఫరా నిలిచిపోయింది.

క్లుప్తంగా

తాండవ నదిలో మునిగి వ్యక్తి మృతి



శ్రీను మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

కోటనందూరు: తాండవ నదిలో మునిగి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన అల్లిపూడి గ్రామంలో చోటుచేసుకుంది. ఆ వివరాల్లోకి వెళ్తే.. అల్లిపూడి ఎస్సీ పేటకు చెందిన వడ్లమూరి శ్రీను (36) బుధవారం స్నానం చేసేందుకు సమీపంలోని తాండవ నదిలోకి దిగగా, ప్రమాదవశాత్తూ నీటిలో మునిగిపోయాడు. అప్పటి నుంచి శ్రీను ఆచూకీ కోసం స్థానికులు గాలించగా, గురువారం ఉదయం అతని మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య వడ్లమూరి సంధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

సదా వేంకటేశం.. స్మరామి స్మరామి



వాడపల్లిలో గజ వాహనంపై స్వామివారికి ఊరేగింపు



బ్రహ్మోత్సవాల్లో శక్తివేషాల ప్రదర్శన



స్వామివారికి తిరుప్పావడ సేవ

- వైభవంగా వాడపల్లి వెంకన్న బ్రహ్మోత్సవాలు
- అశేషంగా తరలివచ్చిన భక్తజనం

కొత్తపేట: సదా వేంకటేశం.. స్మరామి స్మరామి.. అంటూ శ్రీవారిని కొలుస్తూ సాగుతున్న బ్రహ్మోత్సవాలు ఆబాలగోపాలాన్ని మురిపిస్తున్నాయి. కోనసీమ తిరుమల వాడపల్లి క్షేత్రంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజు గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. అశేష సంఖ్య భక్తజనం తరలివచ్చి వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య కార్యక్రమాలను తిలకించి తన్మయత్వం చెందారు. రాజాధిరాజ అలంకరణలో గజ వాహనంపై ఊరేగిన శ్రీవారిని వీక్షించి పరవశించిపోయారు. దేవదాయ – ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు పర్యవేక్షణలో వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం వేద పండితుడు ఖండవిల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి ఆదిత్య అనంత శ్రీనివాస్, అర్చకులు, వేద పండితులు ఉదయం నుంచి రాత్రి వరకూ విశేష పూజలు, హోమాలు, బ్రహ్మోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈఓ చక్రధరరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు దంపతులు పూజాదికాలు నిర్వహించారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొని, స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఉదయం నుంచి పుణ్యాహవచనం, అష్ట కలశారాధన, లక్ష తులసిపూజ, తిరుప్పావడ సేవ, ప్రధాన హోమాలు, దిగ్దేవతా బలిహరణ, నీరాజన మంత్రపుష్పం, సాయంత్రం స్వస్తివచనం, ప్రధాన హోమాలు, దిగ్దేవతా బలిహరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

గజ వాహనంపై ఊరేగిన శ్రీవారు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా రాత్రి స్వామివారిని రాజాధిరాజ అలంకరణలో గజవాహన సేవ అద్భుతంగా సాగింది. శ్రీవారిని గజ వాహనంపై అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల గోవింద నామస్మరణ నడుమ వేద పండితుల వ్యాఖ్యోపన్యాసంతో ఈ వేడుక కన్నుల పండువగా సాగింది. రాజాధిరాజ అలంకరణ అనేది ఒక దేవతామూర్తిని 'రాజులకు రాజుగా' (రాజాధిరాజ), చక్రవర్తిగా అలంకరించే అత్యంత వైభవమైన అలంకారం. ఇది దేవాలయాల్లోని బ్రహ్మోత్సవాల వంటి ఉత్సవాల సమయంలో నిర్వహిస్తారు. దేవుని గజ (ఏనుగు) వాహనంపై ఊరేగిస్తారు. వాడపల్లి బ్రహ్మోత్సవాల్లో ఈ వాహన సేవ నిర్వహించారు. దైవత్వం యొక్క సర్వోన్నత అధికారాన్ని, వైభవాన్ని కీర్తించడం ఈ సేవ ఉద్దేశం. ఈ సేవ భక్తుల కోలాహలం నడుమ విశేషంగా సాగింది. పలువురు ప్రముఖులు, నాయకులు బ్రహ్మోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

కిడ్నాప్ కేసులో నిందితుల అరెస్ట్

పిఠాపురం: ఓ యువతి కిడ్నాప్ కేసులో ముగ్గురిని గురువారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై నౌడు రామకృష్ణ తెలిపారు. ఆయన కథనం ప్రకారం .. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం శ్రీరాంపురం గ్రామానికి చెందిన ఓ యువతి, కర్రి వంశీతో పాటు మరో బాలుడితో ప్రేమ వ్యవహారం జరిపింది. దీనిపై ఆ ముగ్గురి మధ్య కొంత కాలంగా వివాదం నడుస్తుంది. ఈ నేపథ్యంలో ఏర్పడిన గొడవ కారణంగా గత శనివారం ఉదయం ఆ బాలుడు స్కూటర్‌పై ఎక్కించుకుని ఆ యువతిని తుని సమీపంలో రాజానగరం బీచ్ వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ మరో కారులో ఆ యువతిని బలవంతంగా ఎక్కించుకుని బాలుడు, కర్రి వంశీ, అతని స్నేహితుడు రాజు కలసి ఆమెను బెదిరించారు. ప్రేమ వ్యవహారంలో ఎవరో ఒకరిని తేల్చుకోవాలని భయపెట్టి ఆమెను చేతులతో కొట్టి చుట్టుపక్కల ప్రాంతాలు తిప్పుతూ అన్నవరం, కత్తిపూడి మీదుగా చేబ్రోలు గ్రామానికి తీసుకు వచ్చారు. అక్కడ నిర్మానుష్యంగా ఉన్న హైవే పక్కన ఉన్న మట్టి రోడ్డులోకి తీసుకు వెళ్లారు. అప్పటికే అక్కడ సిద్ధంగా ఉన్న సాంబ అని వేరే వ్యక్తితో ఆమెను బెదిరించారు. దీంతో ఆమె కేకలు వేయగా సంఘటనను గమనించిన చుట్టుపక్కల వారు పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు వెళ్లి ఆ యువతని రక్షించి, నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో బాలుడు, కర్రి వంశీ, అతని స్నేహితుడు రాజులను అరెస్టు చేశామని ఎస్సై తెలిపారు. ఇదే కేసులో మరో నిందితుడు సాంబ పరారీలో ఉన్నాడన్నారు.

ఎస్‌బీఐ బ్రాంచ్‌ను ముట్టడించిన డ్వాక్రా మహిళలు

స్వాహా చేసిన రూ.95 లక్షల రికవరీకి డిమాండ్



వేళంగిలో ఎస్‌బీఐ బ్రాంచ్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కూరాడ డ్వాక్రా మహిళలు

కరప: డ్వాక్రా సంఘాల సొమ్మును స్వాహా చేసిన బ్యాంక్ సీసీపై చర్యలు తీసుకోకపోవడంపై వేళంగిలోని ఎస్‌బీఐ బ్రాంచ్‌ను గురువారం కూరాడ గ్రామ డ్వాక్రా మహిళలు ముట్టడించారు. తమ సంఘాల నుంచి దోచుకున్న రూ.95 లక్షలను రికవరీ చేయాలని, అక్రమాలకు పాల్పడిన బ్యాంక్ సీసీపై, ఇందుకు సహకరించిన యానిమేటర్లపై ఇంతవరకూ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కూరాడలో 106 మహిళాశక్తి సంఘాలు ఉన్నాయి. వీరి నుంచి ముగ్గురు యానిమేటర్లు సంఘాల పొదుపు, రుణాల వాయిదా సొమ్మును వసూలు చేసేవారు. వేళంగి ఎస్‌బీఐ బ్రాంచ్ కూరాడలో బీసీ పాయింట్ ఏర్పాటు చేసి, కరస్పాండెంట్‌గా చిన్నం ప్రియభారతిని నియమించారు. ముగ్గురు యానిమేటర్లలో ఒకరు చిన్నం మంగ బ్యాంక్ సీసీ భారతి తల్లి కావడం, ఆమెకు మిగిలిన ఇద్దరు యానిమేటర్లు ఆలపాటి బేబీ, ఆచంట మాధవి సహకరించడంతో డ్వాక్రా సొమ్మును కాజేశారు. బ్యాంక్ సీసీ, యానిమేటర్లు ముగ్గురు ఏకమై పొదుపు, వాయిదాల సొమ్మును బ్యాంక్‌కు చెల్లించకుండా పక్కదారి పట్టించి, సొంతానికి వాడుకున్నారు. ఇది గత నెలలోనే బయటపడినా ఇంతవరకూ అధికారుల నుంచి స్పందన కరవైందని మహిళలు వాపోయారు. తమకు న్యాయం చేయాలని వేళంగిలోని ఎస్‌బీఐ బ్రాంచ్‌ను ముట్టడించారు. కరప పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశామన్నారే కానీ ఇంతవరకూ ఎవరూ తమ గ్రామానికి విచారణకు రాలేదన్నారు. డీఆర్‌డీఏ పీడీ వచ్చాక చర్యలు తీసుకుంటారని ఏపీఎం ఎంఎస్‌బీ దేవి చెప్పారని, ఆయన వచ్చారో, లేదో తెలియడం లేదని మహిళలు వాపోయారు. అవినీతికి పాల్పడిన బ్యాంక్ సీసీ భారతిని విధుల నుంచి తొలగించాలని, స్వాహా చేసిన సొమ్మును రికవరీ చేసి డ్వాక్రా గ్రూపులకు చెల్లించాలని అసిస్టెంట్ మేనేజర్ ఎస్.ఫాల్గుణరావుకు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆయన చెప్పడంలో డ్వాక్రా మహిళలు వెనుతిరిగారు.

వివాహిత ఆత్మహత్య

తొండంగి: వివాహం జరిగి ఏడాది పూర్తి కాకుండానే భర్తతో పాటు అత్తింటి వేధింపులకు ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై బి.జగన్మోహన్‌రావు గురువారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా పాతపట్నం మండలం తిడ్డిమి గ్రామానికి చెందిన గొర్లి శిరీష (23), ఏనుగుతల ప్రదీప్‌కుమార్‌కు సుమారు ఐదు నెలల కిందట వివాహం జరిగింది. కాగా ప్రదీప్‌కుమార్ ఒంటిమామిడిలో దివీస్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. గోపాలపట్నంలో ఓ ఇంట్లో అద్దెకు దిగారు. కొద్ది రోజులుగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. కాగా బుధవారం సాయంత్రం ప్రదీప్‌కుమార్ ఉద్యోగానికి వెళ్లిన అనంతరం అత్తింటివారి వేధింపులే కారణమంటూ సూసైడ్ నోట్ రాసి ఆమె ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని ఎస్సై తెలిపారు. వివాహిత తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని తుని ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించామన్నారు.

ఆ రూ.5.88 లక్షలు ఎక్కడివి?

విచారణ చేపట్టిన ఏసీబీ అధికారులు



ఈ స్థలం సర్వేకే డబ్బులు డిమాండ్ చేసింది

అమలాపురం రూరల్: తీగ లాగితే డొంక కదిలినట్లు అమలాపురం తహసీల్దార్ అవినీతిపై ఏసీబీ అధికారులకు మరిన్ని ఆధారాలు లభ్యమైనట్లు తెలుస్తోంది. ఓ వ్యక్తి స్థలం సర్వే విషయంలో తహసీల్దార్ పి.అశోక్‌ప్రసాద్ రూ.లక్ష లంచం డిమాండ్ చేయడం, కార్యాలయ డేటా ఆపరేటర్, జనుపల్లి వీఆర్ఏ పుప్పాల రాము మధ్యవర్తిత్వంలో రూ.50 వేల బేరం కుదరడం, తర్వాత ఆ భూయజమాని ఏసీబీ అధికారులను ఆశ్రయించడం, ఏసీబీ ట్రాప్‌లో తహసీల్దార్, డేట్ ఆపరేటర్ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన పరిణామాలు తెలిసిందే. తహసీల్దార్ కార్యాలయంపై ఏసీబీ దాడులు జరిగినప్పుడు లంచం తీసుకుంటున్న రూ.50 వేలతో పాటు అక్కడ రూ.5.88 లక్షలు దొరకడం గమనార్హం. అక్కడ అనధికారికంగా ఉన్న రూ.5.88 లక్షలపై ప్రత్యేక దృష్టిపెట్టి, అసలు ఈ నగదు ఎక్కడిది..? ఎలా వచ్చింది...? అనే కోణంలో ఏసీబీ అధికారులు దర్యాప్తు చేపట్టారు. తహసీల్దార్‌ను అరెస్ట్ చేసిన తర్వాత బుధవారం రాత్రి పొద్దుపోయాక ఏసీబీ అధికారులు తహసీల్దార్ ఇంటికి వెళ్లి విచారించారు. ఆ ఇంట్లో ఉన్న తహసీల్దార్ ల్యాప్‌టాప్‌ను అధికారులు సీజ్ చేశారు. అలాగే అధికారులు అమలాపురం ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లి అక్కడా పలువురిని విచారించారు. తహసీల్దార్, డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను తొలుత రాజమహేంద్రవరానికి తరలించారు. అక్కడి నుంచి విజయవాడలోని ఏసీబీ కోర్టుకు తీసుకు వెళ్లినట్లు సమాచారం. తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న రూ.5.88 లక్షల నగదు దీపావళి దుకాణాల ఏర్పాటు గురించి లంచంగా వసూలు చేసిన సొమ్మని తెలిసింది. ఏసీబీ అధికారులు కూడా ఆ దిశగానే దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ

పి.గన్నవరం: స్థానిక హైస్కూల్ రోడ్డులో గుర్తుతెలియని వ్యక్తులు ఓ ఇంటి తాళాలు పగులగొట్టి 16 గ్రాముల బంగారు ఆభరణాలు, 15 తులాల వెండి వస్తువులు చోరీ చేసిన ఘటనపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.శివకృష్ణ తెలిపారు. హైస్కూల్ రోడ్‌లో నివసిస్తున్న ఏడిద వీర వెంకటలక్ష్మి కుటుంబం హైదరాబాద్‌లో వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. గత ఆగస్టులో ఆమె పి.గన్నవరంలో జరిగిన వివాహ కార్యక్రమానికి ఇక్కడకు వచ్చింది. బంగారు ఆభరణాలు, వెండి వస్తువులను ఇంట్లోనే ఆమె వదిలి హైదరాబాద్ వెళ్లిపోయింది. ఈ క్రమంలో ఈ నెల 9న ఆమె ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటాన్ని స్థానికులు గమనించి వెంకటలక్ష్మికి సమాచారం అందించారు. చోరీపై ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం ద్వారపూడిలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పిఠాపురానికి చెందిన సిద్ధనాతి వెంకటేష్ (37) మృతి చెందాడు. పిఠాపురంలో మిఠాయి దుకాణంలో వెంకటేష్ పనిచేస్తూ ఉపాధి పొందుతున్నాడు. ఇప్పనపాడు లింగరాజుపేటలో ఉంటున్న అతని తండ్రి అనారోగ్యం బారిన పడడంతో చూసేందుకు వెంకటేష్ బైక్‌పై వస్తుండగా ప్రమాదం సంభవించింది. ద్వారపూడిలో కొత్త పెట్రోల్ బంక్ సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో వెంకటేష్ తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని మండపేట పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రూరల్ సీఐ పి.దొరరాజు పర్యవేక్షణలో ట్రైనీ ఎస్ఐ సోమేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

WANTED PLOTS

■ ప్లాట్లు కొనబడును: హైదరాబాద్, పటాన్ చెరువు,పెద్దకంజర్ల గ్రామములో Sy.No. 120, 121 & 125 లలో ప్లాట్లు కొనబడును. Ph : 9951005666 చంద్రశేఖర్, Hyderabad. [SCA25008885]

Wanted

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు,RMP&డాక్టర్స్ కావలెను.జీ:15 వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.9014885406 [HA-642]

■ హైదరాబాద్ హోంకేర్‌లో ఏజెంట్లకు మంచి అవకాశం మీరు వర్కర్స్‌ని పంపితే ప్రతి నెల 2 వేల కమీషన్ కలదు వర్కర్ జీ: 18K, ఫ్రీ వసతి ఫుడ్ Ph: 8977547749 [SCA25009055]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
సాక్షి క్లాసిఫైడ్స్
నాలుగు లైన్లకు రూ. : 400/-
అదనపు లైనుకు రూ. : 90/-
GST 5% Extra
సర్వే నెం.264, ADB రోడ్, రాజానగరం.
ఫోన్స్: 0883-2483010

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కెనరా బ్యాంక్ (భారత ప్రభుత్వరంగ సంస్థ) Canara Bank A Government of India Undertaking
సిండికేట్ Syndicate
జ్యూవెల్ అప్రైజర్స్ కావలెను
మా బ్రాంచ్‌ల నందు పనిచేయుటకు అనుభవం మరియు అర్హత కలిగిన జ్యూవెల్ అప్రైజర్స్ కావలెను.
దరఖాస్తుల స్వీకరణకు చివరి తేది : 31-10-2025
దరఖాస్తు చేయుటకు కనీస అర్హతలు : (1) వయస్సు 30 సం॥ నుండి 60 సం॥లోపు (2) ఈ రంగంలో 5 సం॥ల కనీస అనుభవం (ఋజువు తప్పనిసరి) (3) కనీసం 10వ తరగతి ఉత్తీర్ణులయ్యి ఉండవలెను. (4) గుర్తింపు పత్రాలు (కెవైసి) మరియు పోలీసు వెరిఫికేషన్ సర్టిఫికెట్ (5) ఇద్దరు వ్యక్తుల రిఫరెన్స్ మరియు వారి గుర్తింపు పత్రాలు
కెనరా బ్యాంక్, రీజనల్ ఆఫీసు, కాకినాడ వారిచే నిర్వహింపబడే నైపుణ్య పరీక్షలో అభ్యర్థులు ఉత్తీర్ణులు కావాలి
సంప్రదించండి : రీజనల్ కార్యాలయం – కాకినాడ, డో.నెం. 2-26-1, వార్డు నెం.5, 50 బిల్డింగ్స్ సెంటర్, శ్రీనగర్, కాకినాడ – 533 103. ఆం.ప్ర. సెల్ : 8331026844

KVB Karur Vysya Bank Smart way to bank
ది కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్
డివిజనల్ ఆఫీస్, డి.నెం.47-10-15, ఫస్ట్ ఫ్లోర్, ఎ.జి.ఎవెన్యూ, పొలారిస్ స్కూల్ ఎదురుగా, 2వ లైన్, ద్వారకానగర్, విశాఖపట్నం - 530 016. ఫోన్ : 0891-2511706
స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 9(1) నందలి నిబంధనలతో చదువుకోవల్సిన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు వేలం ఇ-వేలం అమ్మకం ప్రకటన.
సాధారణ ప్రజానీకానికి ముఖ్యంగా ఋణగ్రహీతలు మరియు హామీదారులకు ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా 1. మెసర్స్ గోదావరి క్యాష్యూ ఫుడ్స్, ప్రాతినిధ్యం వహిస్తున్న యజమానురాలు : శ్రీమతి పర్మిళ రాణి జి, భర్త : శ్రీ కె. సుబ్రహ్మణ్యం బాబు, సర్వే నెం.55/21, ఎఫ్‌సిఐ గోడౌన్ దగ్గర, గొల్లప్రోలు – 533445 మరియు 2. శ్రీ కె. సుబ్రహ్మణ్యం బాబు, తండ్రి : సింహాచలం, ఎస్.నెం.55/2ఎ, ఫ్లాట్ నెం.33బి, డి.నెం.9-138/1, హైస్కూల్ దగ్గర, జనరల్ హాస్పిటల్ మరియు ఫైర్ స్టేషన్ వెనుక వైపు, జగపతినగరం గ్రామం మరియు గ్రామ పంచాయితీ, ప్రత్తిపాడు, కిర్లంపూడి మండలం – 533432 వారి నుండి రావల్సిన బకాయి రూ. 59,97,512.50 పై. (అక్షరాల యాభై తొమ్మిది లక్షల తొంభై ఏడు వేల ఐదు వందల పన్నెండు రూపాయల యాభై పైసలు మాత్రమే) (అకౌంట్ నెం. 4845280000000036) + తేది.01.10.2025 నుండి తదుపరి వడ్డీ మరియు వ్యయాలు మొదలగునవి రాబట్టుకొనుటకు సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన ది కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్, పిఠాపురం బ్రాంచ్, పిఠాపురం యొక్క అధీకృత అధికారియైన సెక్యూర్డ్ క్రెడిటార్‌చే స్వాధీనత చేపట్టబడిన దిగువ తెలిపిన స్థిరాస్తులను 10-11-2025 న "ఎక్కడ ఏది ఎలా ఉన్నది అక్కడ అలానే ప్రాతిపదికన" విక్రయించబడును.
స్థిరాస్తి వివరములు:
తూర్పు గోదావరి జిల్లా – 533445, గొల్లప్రోలు రూరల్ మండలం, గొల్లప్రోలు గ్రామ పంచాయితీ, తాటిపర్తి రోడ్డు, ఎఫ్‌సిఐ గోడౌన్స్ ప్రక్కన, కొత్త డి.నెం.20-1-289/1, పాత డి.నెం.2-283/1, ఎస్.నెం.55/21, పట్టా నెం.1211 లోని 1161.6 చ॥గజ॥లు (వాస్తవంగా 1139.25 చ॥గజ॥లు) విస్తీర్ణం గల స్థలంలోని అన్ని సూపర్‌స్ట్రక్చర్ మరియు సదుపాయాలతో గల ఎసి షీట్ రూఫ్‌డ్ షెడ్ యావత్తు ఆస్తి రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.617/2012, తేది.02.02.2012 ప్రకారం కలదు. హద్దులు : ఉత్తరం : బత్తినీడి కుమారి గారికి చెందిన ఆస్తి, తూర్పు : ఎఫ్‌సిఐ గోడౌన్స్, పడమర : మురళీశెట్టి గంగరాజు గారికి చెందిన ఆస్తి, దక్షిణం : తాటిపర్తి గ్రామానికి పోవు రోడ్డు.
రిజర్వు ధర : రూ.57,00,000/- ధరావత్తు : రూ.5,70,000/-
బిడ్డు పెంపుదల మొత్తం : రూ.50,000/-
అమ్మకం యొక్క ఇతర వివరములు మరియు నియమ నిబంధనల కొరకు www.bankauctions.in ని చూడండి (ఇ-వేలం యొక్క ప్రొవైడర్ వెబ్ చిరునామా) లేదా అధీకృత అధికారి, ది కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్, పిఠాపురం మొబైల్ నెం. 9963477690.
SARFAESI చట్టం, 2002 యొక్క రూల్ 9(1) క్రింద 15 రోజుల చట్టబద్ధ ప్రకటన
చెల్లింపు తేదీ వరకు వడ్డీ మరియు అనుబంధ ఖర్చులతో పాటు పైన తెలిపిన బకాయిలను వేలం తేదీలోపు చెల్లించవలెనని, లేనిచో, షెడ్యూల్ ఆస్తి వేలం వేయబడుతుందని/విక్రయించబడుతుందని మరియు మిగిలిన బకాయిలు ఏవైనా ఉన్నట్లయితే, వడ్డీ మరియు ఖర్చులతో పాటు వసూలు చేయబడతాయని రుణగ్రహీత/లు మరియు గ్యారంటర్/లకు ఇందుమూలముగా తెలియజేయడమైనది. SARFAESI చట్టం, 2002 నిబంధనకు అనుగుణంగా ఈ నోటీసు జారీచేయబడినది.
తేది: 15-10-2025
స్థలం: విశాఖపట్నం
అధీకృత అధికారి
ది కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్, పిఠాపురం బ్రాంచ్, పిఠాపురం